# క్షమయా ధరిత్రి!...

"ఆడవాళ్లకి మగవాళ్ల కంటే ఎంతో ఓర్పెక్కువ అంటారు కదూ!" అడిగింది సుమన.

"అంతా ఇంతా కాదు. ఎటువంటి గుండె పిండే బాధనైనా సరే కడుపులో పెట్టుకుని దాచుకునే శక్తిని ఒక స్త్రీకే ప్రసాదించాడు దేముడు".

"అవును మరి! కష్టాలన్నీ కూడా ఆమెకే పెట్టాడు కదా! అందుకనీ!" నవ్వింది సుమన.

"అయితే కష్టాలను భరించే ఓర్పూ, పరిష్కరించే నేర్పూ కూడా స్త్రీకే ప్రసాదించాడు. సరూ తెలుసుకదూ నీకు?"

"అవును. వెంకటేశ్వరరావు పెళ్లాం కదూ?" అడిగింది సుమన.

"అవును! తెలీదా ఆవిడ సంగతి నీకు?" ప్రశ్నించింది రామేశ్వరి.

"ఏదో విన్నాను కానీ పూర్తిగా ఫలానా విషయం అని తెలీదు".

"నీకు వీణ తెలుసా?"

"అవును తెలుసు. భర్త ఒదిలేశాడూ ఆవిడే కదూ?"

"ఆ... వీణ మొగుడూ, సరోజిని భర్త, వెంకటేశ్వరరావు స్నేహితులట. వీణని ఆమె భర్త మురళి ఒదిలేస్తే, వీణని ఓదార్చడానికి రోజూ వాళ్లింటికి వెళ్లేవాడట వెంకటేశ్వరరావు. దాంతో వీళ్లిద్దరికీ ప్రేమ పుట్టుకొచ్చింది. తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకున్నారు" చెప్పడం ఆపి వెళ్లి మంచినీళ్లు తాగొచ్చింది సుమన.

"పెళ్లి చేసుకున్నారా? నాకు తెలీదే?"

"విడాకులు కూడా అయిపోయాయిలే! అసలు సంగతి విను."

"వీళ్లు పెళ్లి చేసుకున్న సంగతి విని ఎంతో బాధపడి పోయింది సరోజిని. తన భర్త తన కళ్లెదుటే మరో స్త్రీతో కాపురం చెయ్యడం ఏ ఆడది మాత్రం భరించగలదు? పోతే సరూ అందరి ఆడవాళ్లలాగా ఏడ్చి ఏడ్చి నెత్తీనోరూ

కొట్టుకోలేదు. పెట్టెబేడా పట్టుకుని పుట్టింటికి పారిపోలేదు. 'నా భర్త ఎప్పటికైనా మళ్లీ నా దగ్గరికే వొస్తాడు' అంటూ ధయిర్యంగా వుండేది తన పిల్లల్ని తను చూసుకుంటూ. ఆమె ఆత్మవిశ్వాసమో, అదృష్టమో, ఆమె ఓర్పు వహించినందుకు ఫలితం ఆమె అనుకున్నట్టుగానే ఒక ఐదారేళ్లు తిరక్కుండానే వెంకటేశ్వరరావు వీణతో తెగతెంపులు చేసుకుని సరూ దగ్గరికి చేరుకున్నాడు. క్షమించమని వేడుకున్నాడు. సరూ గర్వంగా అతడ్ని క్షమించింది.

గత ఐదారేళ్లూ తన భర్త వీణతో కలిసి తిరిగిన తిరుగుళ్లు, చేసిన జల్సాలు సరూ గుండెని పిండివేశాయి. రక్తాన్ని గడ్డకట్టించేశాయి. నరాలు చిట్లిపోయాయి. తన మనసులోని బాధను తోబుట్టువులతో గానీ, స్నేహితులతోగానీ చివరికి కన్నబిడ్డలతో కానీ చెప్పుకోలేదు సరూ! తన మనసులోనే దాచుకుని ఒంటరిగా విలపించింది. ధయిర్యంగా దర్జాగా తన సంసారాన్ని తను నడుపుతూ, బిడ్డలకి కావలసినవి సమకూరుస్తూ వచ్చింది. అలా వుండడానికి ఎంత ఓర్పు కావాలో నేను మాటలలో చెప్పగలనా? 'క్షమయా ధరిత్రి' అంటే ఇదేనేమో! దుష్టులనీ, శిష్టులనీ సమస్త మానవాళినీ, అన్ని జీవరాసులనీ, బండరాళ్లని, కొండలని, వటవృక్షాలనీ, నదీనదాలనీ, అన్నింటినీ మోసే భూమాత కున్నంత ఓర్పు ఇల్లాలి కుండాలంటారు.

సరూ రచ్చకెక్కి తను అల్లరిపడి, భర్తను అల్లరిపాలు చేసుంటే ఈనాడు అతడు వీణతో తెగతెంపులు చేసుకున్నాక, సరూ దగ్గరికి వచ్చేవాడు కాదు. ఇంకేమైనా చేసుండేవాడు. సరూ మౌనం, ఆమె ఓర్పూ వెంకటేశ్వరరావుని మరింత అల్పుడ్ని చేసింది. తను చేసిన పనికి తనే సిగ్గుపడుతూ సరూ కాళ్లమీద పడి క్షమాపణ వేడుకున్నాడు. సరూ కాపురం చక్కబడింది. సరూలోని ఆ సహనానికి నా జోహార్లు! ఏమంటావ్?" అడిగింది సుమన.

"నిజమే! ఆమెలో ఆ ఓర్పు, క్షమాగుణమే లేకపోతే ఆ కుటుంబంలోని నలుగురూ నాలుగు దిశలుగా చెల్లాచెదురైపోయుండే వారు. అంది రామేశ్వరి.

అంతలో సుమన కూతురు సృజన కాఫీ తీసుకు రావడంతో ఆ సంభాషణ ఆపి కాఫీ తాగడంలో నిమగ్నమయ్యారు సుమనా రామేశ్వరి. *